

పాలోమంటూ పోలేరమ్మ జాతరకు..



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

విరూపోత్సవంతో ముగిసిన వేడుక

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 11: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర జనసంద్రాన్ని తలపించింది. గురువారం ఉదయం 4 గంటలకే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. బుధవారం రాత్రి చాకలింటి నుంచి ఊరేగింపుగా వచ్చిన అమ్మవారిని.. గురువారం వేకువజామున ఆలయం వద్ద వేపమండలతో వేసిన పందిరిలో కొలువుదీర్చారు. అప్పట్నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. వేయికళ్ల దుత్తల్లో బియ్యపు పిండితో చేసిన ప్రమిదలలో నూనె దీపాలు వెలిగించి భక్తులు నెత్తిన పెట్టుకు వచ్చి నాలుగు కూడల్లో బద్దలు కొట్టారు. మడిచీరలపై ఆసాదుల తప్పెట్ల నడుమ మరికొందరు. నవధాన్య మొలకలను అమ్మవారికి సమర్పించారు. రాజాల ప్యాలస్ నుంచి ఆభరణాలైన బంగారు శూలం, సరుడును రాజా అనుచరుల ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరించి తీసుకెళ్లారు. నగరి సారెలైన సరవళ్లను రాజా అనుచరులు అమ్మవారికి 12గంటలకు సమర్పించారు. దీంతో వెట్టివారు కుండలో వెలిగించిన గండర దీపాన్ని అమ్మవారికి చూపించి దీపం ఆరకుండా ఊరి పొలిమేరల్లోకి తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారి బలి దున్నపోతును బలిచ్చి ఆ రక్తంతో పొలికుండల్లోని అన్నంతో కలిపి ఊరి పొలిమేరల్లో పొలి..పొలి అని అరుస్తూ చల్లారు. అనంతరం దీపాన్ని విరూప మండపానికి తీసుకెళ్లారు. దున్నపోతు రక్తంతో తడిచిన కత్తిని అమ్మవారికి చూపాక.. రాజాల ప్యాలెస్‌లో పూలతో అలంకరించిన ట్రక్కులో అమ్మవారి ప్రతిమను సాయంత్రం 4 గంటలకు భక్త జనసందోహం నడుమ ఊరేగించారు. శివాలయం వద్దకు ఊరేగింపు చేరుకోగా, అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను తీసేశారు. అనంతరం కైవల్యానది మీదుగా మల్లయ్య తోట వద్ద ఏర్పాటు చేసిన విరూప మండపానికి అమ్మవారు చేరుకోగా, 7.35 గంటలకు ప్రతిమను విరూపం చేసే కార్యక్రమం ముగిసింది. అప్పటి వరకు గండర దీపం ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి ప్రతిమ మట్టిని ఇంట ఉంచుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయని, తింటే రోగాలు దూరమవుతాయన్నది భక్తుల నమ్మకం. అందుకని మట్టి కోసం భక్తులు పోటీపడటంతో విరూప మండపం వద్ద కొంత ఉద్రిక్తత నెలకొంది.

ఎటు చూసినా భక్త జనమే 8

హమ్మయ్య.. వచ్చేశాం!

- ఆశలు వదులుకున్న మాకు ప్రభుత్వం ప్రాణం పోసిందంటూ భావోద్వేగం
- నేపాల్ నుంచి రేణిగుంట చేరుకున్న 40 మందికి ఘన స్వాగతం



బస్సులో స్వస్థలాలకు..

తిరుపతి(వైద్యం)/రేణిగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విహార యాత్రలో భాగంగా నేపాల్ వెళ్లారు. అక్కడ నెలకొన్న అలర్ల నేపథ్యంలో ఏర్పడిన తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల్లో చిక్కుకున్నారు. తిరిగి ఇళ్లు చేరగలమా అని ఆందోళన చెందారు. అలాంటి వారికి ప్రభుత్వం అండగా నిలిచింది. నేపాల్ నుంచి రప్పించింది. అలా తిరుపతి జిల్లాకు చెందిన 9 మంది, కడప జిల్లా 19, నెల్లూరు జిల్లా చెందిన ఐదుగురు, అన్నమయ్య జిల్లాకు చెందిన ముగ్గురు, అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు, నంద్యాల జిల్లాకు చెందిన 2.. మొత్తం 40 మంది గురువారం రాత్రి 10.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఉద్విగ్నత, ఉత్సాహం, భావోద్వేగానికి గురయ్యారు. వీరికి ఎయిర్‌పోర్టులో కలెక్టర్ వెంకటేశ్వర్‌తోపాటు తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు, కడప, కోడూరు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్, మాధవిరెడ్డి, శ్రీధర్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తదితరులు స్వాగతం పలికారు. ప్రయాణం ఎలా సాగిందని అడిగారు. ప్రభుత్వ చొరవ, నారా లోకేష్ కృషి లేకుంటే తాము స్వదేశానికి చేరుకునే వాళ్లం కాదంటూ వారంతా భావోద్వేగానికి లోనయ్యారు. వీరికి తిరుమల శ్రీవారి, శ్రీకాళహస్తీశ్వరస్వామి ప్రసాదాలను అందజేశారు. విమానాశ్రయంలో భోజన వసతి కల్పించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో వారిని స్వస్థలాలకు తరలించారు.





నేపాల్ నుంచి వచ్చిన వారితో ఎమ్మెల్యేల మాటా మంతి

ఇప్పటికీ భయమేస్తుంది



నేపాల్లో మేము చూసిన పరిస్థితులను తలుచుకుంటే ఇప్పటికీ భయమేస్తుంది.ఇక అయిన వారిని చూడలేమని, ప్రాణాలతో బయటపడలేమనే పరిస్థితులకొచ్చాం. అలాంటి మమ్మల్ని బయట పడేసి సురక్షితంగా ఇళ్లకు చేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి ప్రశంసనీయం.

- చంద్రశేఖర్‌రావు, తిరుపతి

తిరిగి వస్తామనుకోలేదు



విహారయాత్ర కాస్త మా కుటుంబంలో విషాద యాత్రగా మారుతుందనుకున్నాను. అక్కడ పరిస్థితులు చూస్తే ఆ విధంగానే ఉన్నాయి. బయటకు అడుగు పెట్టాలంటే భయం. హోటళ్లో ఉండాలన్నా వాటిపైనా దాడులు. అటువంటి పరిస్థితుల నుంచి బయట పడేసి సురక్షితంగా ఇంటికి చేరుకోవడం ఆనందంగా ఉంది.

- లోహిత, రేణిగుంట

నా భార్యకు తగిలే దెబ్బలు చూసి..



ఈ నెల 5న నా భార్య శ్రీదేవితో కలిసి నేపాల్ వెళ్లా. మేము ఉంటున్న హోటల్‌పై ప్రజలు తీవ్రంగా దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో నా భార్య బాగా గాయపడింది. నా ప్రాణాలు విలవిల్లాడాయి. హోటల్లో నుంచి బయటకు కూడా రాలేమనుకున్న పరిస్థితుల్లో ఏకంగా ఇంటికే తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉంది. ఇందుకు కృషి చేసిన ప్రభుత్వానికి రెండుచేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నా.

- నాగేంద్రప్రసాద్, కడప

మా వాహనాలపై రాళ్లు విసిరారు



పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించుకుని మనదేశ సరిహద్దుకు వస్తున్న మా వాహనాలపై అక్కడి వారు రాళ్లు విసిరారు. ప్రాణాలతో బయటపడి బిక్కు బిక్కుమంటున్న మేము రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఊపిరి పీల్చుకున్నాం. 24 గంటల్లో సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోగలిగాం.

- ప్రకాష్ బాబు, మదనపల్లె

రెండు రోజులు హోటళ్లకే పరిమితమయ్యాం



ఈనెల 1న కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి నేపాల్ వెళ్లాం. అన్ని ప్రాంతాలు చూసుకుని తిరుగు ప్రయాణమయ్యే సమయంలో అక్కడి పరిస్థితులు అనూహ్యంగా మారిపోయాయి. స్థానికులు మా బస్సుపై దాడి చేశారు. రెండు రోజులు హోటళ్లకే పరిమితమయ్యాం. కూటమి ప్రభుత్వం స్పందించి మమ్మల్ని గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేయడం ఆనందం కలిగించింది.

- రాజేశ్వరి, కడప

బస్సులోనే ప్రాణాలు పోతాయనుకున్నాం



మా బస్సును వందల మంది ఒక్కసారిగా వచ్చి చుట్టుముట్టి రాళ్లతో దాడులకు తెగబడ్డారు. ఆ దాడిలో బస్సులోని వారు అనేక మంది గాయపడ్డారు. మాకు కూడా రాళ్ల దెబ్బలు తగిలాయి. మా ప్రాణాలు బస్సులోనే పోతాయి అనుకున్నాం. ఆ సమయంలో కొందరు పోలీసులు అక్కడకు చేరుకొని ఆందోళనకారులను చెల్లాచెదురు చేశారు. అక్కడి పరిస్థితులను చూసి ఇక ప్రాణాలతో తిరిగి వస్తామనుకోలేదు. అంతటి పరిస్థితులు కొనసాగుతున్న దేశంలో నుంచి మమ్మల్ని స్వదేశానికి తీసుకువచ్చిన ప్రభుత్వానికి, మంత్రి లోకేశ్‌కు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

- మల్లికార్జున్, శశికళ దంపతులు, అనంతపురం



పరిపాలనా భవనంలో స్వామి చిత్రపటానికి హారతి ఇస్తున్న ఈవో సింఘాల్

టీటీడీ పరిపాలనా భవనంలో ఈవో

తిరుమల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఈవోగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని పలు శాఖలను సందర్శించారు. అకౌంట్స్, అన్నదానం, బోర్డు సెల్, ఐటీ, సోషల్‌మీడియా, ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, ప్రజా సంబంధాలు, ఎస్టేట్ కార్యాలయాలను సందర్శించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఉద్యోగులు ఈవోకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు పద్మావతి, గోవిందరాజస్వామి, కపిలేశ్వర స్వామి, కోదండరామ స్వామి ఆలయాల నుంచి వచ్చిన వేదపండితులు ఈవోకు ఆయన ఛాంబర్‌లో ఆశీర్వచనం చేశారు. ఈవో పలు ఫైళ్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఈవో సిబ్బందితో మాట్లాడుతూ, అధికారులు, ఉద్యోగులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని సేవలను వేగవంతం చేయాలని సూచించారు.



తన ఛాంబర్‌లో ఫైలుపై సంతకం చేస్తున్న ఈవో

మహిళా సాధికారత సదస్సుపై అధికారులకు శిక్షణ

- శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్,వేదికపై జేసీ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా ఈ నెల 14, 15వ తేదీల్లో జరిగే జాతీయమహిళా సాధికారత సదస్సు విజయవంతానికి లైజన్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో సదస్సుకు సంబంధించి లైజన్ అధికారుల శిక్షణా కార్యక్రమానికి జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రతి ప్రజాప్రతినిధికి ఒక లైజన్ అధికారి,ప్రతి రాష్ట్రానికి ఒక నోడల్ అధికారిని కేటాయిస్తామన్నారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల మహిళా ప్రజాప్రతినిధులు, సామాజిక సేవా సంస్థలప్రతినిధులకు నగరంలోని పలు హోటల్స్‌లో బస ఏర్పాటు చేశామన్నారు. వారికి లోటుపాట్లు లేకుండా లైజన్ అధికారులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి స్మార్ట్‌సిటీ జనరల్ మేనేజరు చంద్రమౌళి, అధికారులు పాల్గొన్నారు.

ఎస్వీఎంసీలో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో రెండేళ్ల కాలవ్యవధి పారామెడికల్ డిప్లొమా (అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్) కోర్సులకు సంబంధించిన దరఖాస్తుల గడువును ఈనెల 27వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీ 30 సీట్లు, డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీపీఎంబీ.సీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. పూర్తి వివరాలకు 9440879943ను సంప్రదించాలని పేర్కొన్నారు.

15న మారిషస్ ప్రధాని రాక

తిరుపతి (కలెక్టరేట్), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మారిషస్ ప్రధాని డాక్టర్ నవీన్ చంద్రరామ్ గులాం సతీసమేతంగా ఈనెల 15న రానున్నారు.ఆరోజు ఉదయం ప్రత్యేక విమానంలో 1గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.అక్కడి నుంచి రామచంద్రాపురం మండలం సి.రామాపురంలోని బ్రహ్మర్షి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. మధ్యాహ్నం 2.30గంటలకు తిరుమల చేరుకుంటారు. 3గంటలకు శ్రీవారిని దర్శించుకోనున్నారు. 5గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీ వెళతారు.

జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ బదిలీ

- నూతన డీఎఫ్‌వోగా సాయిబాబా -

మంగళం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్‌ను నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రీజనల్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబాను తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారిగా నియమించారు. అలాగే తిరుపతి బయోట్రిమ్ స్టేట్ సెల్వి కల్చరిస్టు నరేందిరన్‌ను అమరావతిలోని పీసీసీఎఫ్ డిప్యూటీ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టుగా బదిలీ చేశారు. గతంలో తిరుపతి జూపార్కు క్యూరేటర్‌గా పనిచేసిన బబితను బయోట్రిమ్ స్టేట్ సెల్వి కల్చరిస్టుగా నియమించారు.

సెట్విన్ సీఈవోగా యశ్వంత్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సెట్విన్ సీఈవోగా డాక్టర్ పి.యశ్వంత్ నియమితులయ్యారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్‌తో ఈయన డిప్యూటేషన్‌తో ఇప్పటి వరకు విజయవాడలోని పశుపోషణ విభాగం సంచాలకులుగా ఉన్నారు. ఏడాది కాలపరిమితితో డిప్యూటేషన్‌పై తిరుపతి జిల్లా సెట్విన్ సీఈవోగా బదిలీ అయ్యారు.

భూసమస్యల పరిష్కారానికి రీసర్వే


శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

చంద్రగిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించడానికి రీసర్వే చేపట్టినట్లు తహసీల్దార్ శివరామసుబ్బయ్య తెలిపారు. గురువారం .రంగంపేటలో రెవెన్యూ గ్రామ సభ జరిగింది. సర్పంచ్ ఎర్రయ్య అధ్యక్షత వహించారు. రీసర్వేకు సంబంధించిన డీఎల్ఆర్ చదివి వినిపించారు. రీసర్వేలో పొరపాట్లు గుర్తిస్తే అర్జీ ఇస్తే వారం రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. నాగపట్ల రెవెన్యూ లెక్కదాఖల్లోని సర్వే నెంబర్ 80-ఎలో 1.50 ఎకరాల భూమినికి పరిశీలించారు. దీనిని శ్మశాన వాటికకు కేటాయించారు. మండల సర్వేయర్ సురేష్‌బాబు, వీఆర్వో బాస్కర్, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం విరిగి ఇళ్లపై పడ్డ తీగలు


విరిగిన విద్యుత్ స్తంభం -ఇళ్లపై పడ్డ విద్యుత్ తీగలు

భాకరాపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభం విరిగి ఇళ్లపై తీగలుపడ్డాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. భాకరాపేట సబ్-స్టేషన్ 33 కేవీ విద్యుత్ లైను చట్టేవారిపాళెం పంచాయతీ కృష్ణాపురం కాలనీ ఇళ్లపైగా వెళుతుంది. గురువారం తెల్లవారుజామున వర్షం పడుతున్న సమయంలో కాలనీకి సమీపంలోని మామిడి తోటలో ఓ విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో విద్యుత్ తీగలు కాలనీ ఇళ్లపై పడ్డాయి. నేరుగా ఇళ్లపై పడి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. ఇళ్ల కోసం వేసిన కేబుల్ వైర్లపై ఇవి పడడంతో ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారంతో అధికారులు ఎ వెంటనే సరఫరా నిలిపివేశారు. గురువారం ఉదయం ఏడీ రామ్‌రెడ్డి కొత్త స్తంభాలు వేయింది లైన్‌ను పునరుద్ధరించారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ నాయకులు

తిరుచానూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ సలహాదారు ఎస్ వెంకటముని కోరారు. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పాఠశాల సమయం అనంతరం ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. నాయకులు కృష్ణమూర్తి, హిమాచలం, లీలా ప్రతాప్, వెంటకరత్నం, భూపాల్, దీపక్, సంపూర్ణమ్మ, శ్యామల, ప్రబావతి, వాణి, అనిత, అరుణ, జమునరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆ వాచ్‌మెన్లను విధుల నుంచి తొలగించాలి


ప్రిన్సిపాల్‌కి వినతి ఇస్తున్న నాగేశ్వరరావు, తదితరులు

తిరుపతి రూరల్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తాటితోపులోని బీసీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో మద్యం తాగి డ్యూటీ చేస్తున్న ఇద్దరు వాచ్‌మెన్లను విధుల నుంచి తొలగించాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యు.నాగేశ్వరరావు కోరారు. సంఘ ఆధ్వర్యంలో గురువారం ప్రిన్సిపాల్ గిరిధర్‌ని కలసి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ వాచ్‌మెన్లు విద్యార్థులతో కూడా మద్యం తాగించడం బాధాకరమన్నారు. స్కూల్ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు ఉత్తరాది విజయ్, బజారి, వెంకట్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆదరణే వృద్ధులకు ఆరోగ్యం


వృద్ధులతో విద్యార్థులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వృద్ధులను ప్రేమతో ఆదరించాలని ఎస్వీ యూనివర్సిటీ సామాజిక విభాగాధిపతి కుసుమ అన్నారు. పొరకాల్వ పాస్ వృద్ధాశ్రమంలో ఎస్వీ యూనివర్సిటీ సామాజిక విభాగం పలు కార్యక్రమాలను చేపట్టింది. ఈ సందర్భంగా డాక్టర్ కుసుమ మాట్లాడుతూ వృద్ధాప్యంలో వారి మనోభావాలను తెలుసుకుని ఆదరిస్తే ఆరోగ్యం బాగుటుందన్నారు. వృద్ధులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ప్రొఫెసర్లు వెంకటేష్, ముకుందనాయుడు, రమణయ్య, పాస్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణమూర్తి, కార్యదర్శి మంజుల తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగిన హాకర్‌పై చీపురుతో దాడి



తిరుమల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం రాత్రి ఇద్దరు హకర్లు ఘర్షణ పడ్డారు. మద్యం తాగి వచ్చి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఓ మహిళ చీపురు కర్రతో దాడి చేసింది. మద్యం మత్తులో ఉన్న వ్యక్తి కూడా మహిళపై దాడికి ప్రయత్నించాడు. పీఏసీ-4 వద్ద జరిగిన ఈ ఘర్షణతో చూసి భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

రోడ్డు మార్జిన్‌తో వాహనదారుల ఇబ్బందులు



పాకాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు-కొమ్మిరెడ్డిగారిపల్లె రోడ్డు మార్జిన్ కోతకు గురికావడంతో ఇబ్బందికరంగా మారదింది. దామలచెరువు రైల్వే బ్రిడ్జి కింద నుంచవ కొమ్మిరెడ్డివారిపల్లె వరకు రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు మార్జిన్ కోతకు గురైంది. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చిన వాహనాలకు చోటు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గాన్ని విస్తరించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడితే రోడ్డుపై పేరుకుంటున్న నీరు



భాకరాపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రంగన్నగారిగడ్డకు వెళ్లే రోడ్డులో శ్రీజ డైరీ సమీపంలో చిన్నపాటి వర్షం పడినా నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. యూనియన్ బ్యాంకు నుంచి ఆసుపత్రి వరకు ఆర్అండ్‌బీ సీసీ రోడ్డు వేసిసింది. పల్లంగా ఉండడంతో చుట్టుపక్కల పడిన నీరు అక్కడ చేరుతోంది. ఆ నీరు వెళ్లడానికి వీలు లేకపోవడంత రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, మండల కార్యాలయాలు, సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే ఇదే దారి. వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాదర్బార్‌లో అర్జీల స్వీకరణ


అర్జీ స్వీకరిస్తున్న నాని

తిరుచానూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం రఘునాథ్‌రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆరు మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిసోమవారం కలెక్టరేట్, తహసీల్దారు కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి గురువారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా శ్రీనివాసులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడి ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి బదిలీపై పదోన్నతితో ఐరాల ఎంపీడీవోగా వెళ్లారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నివారణ సాధ్యం


క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నివారణ సాధ్యపడుతుందని కమ్మపల్లి, కుప్పంబాదూరు వైద్యాధికారులు చత్రప్రకాష్‌రెడ్డి, పూర్ణ అన్నారు. కమ్మపల్లి, కుప్పంబాదూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో గురువారం పింక్ బస్సు ద్వారా ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణచర్యలపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రత్యూష, లలిత్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, చైతన్యభాను, ఎంపీహెచ్ఈవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నేపాల్‌లో తెలుగువారి భద్రతకు లోకేష్ ప్రశంసనీయకృషి

తిరుచానూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):నేపాల్‌లో అల్లర్లు కారణంగా అక్కడ చిక్కుఉన్న తెలుగు వారందరిని సురక్షితంగా వారివారి ప్రాంతాలకు చేరుకునేలా కృషి చేసిన రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ పనితీరు ప్రశంసనీయమని వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ చిత్తూరుజిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ కొనియాడారు. తిరుచానూరులోని నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సుమారు 217మంది తెలుగు వారు నేపాల్‌లో చిక్కుకున్నట్లు సమాచారం రాగానే ఆర్టీజీఎస్ సెంటర్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ద్వారా సమీక్షించి సురక్షితంగా రాష్ట్రానికి రప్పించారన్నారు. వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి, మోహన్‌రెడ్డి, గోవిందరెడ్డి, శేషాద్రి పాల్గొన్నారు.

గోవింద ధామానికి రూ.4 లక్షల విరాళం



చంద్రగిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది తీరాన గోవిందధామం ఆవరణలో వెయిటింగ్ హాల్ నిర్మాణానికి రిటైర్డు టీచర్ పి జనార్దన్ రెడ్డి, విశాలక్షి దంపతులు ముందుకొచ్చారు. చంద్రగిరికి చెందిన వీరు తొలివిడతగా రూ.4 లక్షల చెక్కును విరాళంగా గురువారం గోవిందధామం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాజీ జడ్పీటీసీ వీరంగారి రమేష్ రెడ్డి, రిటైర్డు ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు, ఓంకార్ భరద్వరాజ్‌లు పాల్గొన్నారు.

'బదిలీ చేసినా రిలీవ్ చేయడంలేదు'

ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి); బదిలీ ఆదేశాలు వచ్చినా తమను రిలీవ్ చేయకుండా తహశీల్దార్ పరమేశ్వర స్వామి ఇబ్బంది పెట్టుతున్నారని వీఆర్‌ఓలు రమణ,శివనారాయణలు ఆరోపించారు. బదిలీ వచ్చినా రిలీవ్ చేయకపోవడం తగదని వీరిరువురూ గురువారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీఆర్వోలు కేటాయించిన పనులను పూర్తి చేయలేదని తహశీల్దార్ పేర్కొన్నారు. పని పూర్తి చేయగానే బదిలీ చేస్తామన్నారు.

సర్పంచ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



చంద్రగిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అగరాల సర్పంచ్ తూకాకుల భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం చంద్రగిరిలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. భాస్కర్‌రెడ్డిని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డిలు శాలువాతో సన్మానించారు. వైసీపీ నాయకులు దేవరాజులరెడ్డి, చంద్రమౌళిరెడ్డి, శంకర్ యాదవ్, బోడిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల చెంతకు పశువిజ్ఞాన పరిశోధనా ఫలాలు

● వెటర్నరీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ జేవీరమణ, షేక్ ఎన్.మీరా తదితరులు

తిరుపతి రూరల్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): పశువిజ్ఞానశాస్త్ర పరిశోధనలను క్షేత్రస్థాయిలో రైతుల చెంతకు చేర్చాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ పేర్కొన్నారు. వర్సిటీలోని నిరంతర పశువైద్యవిద్య, సమాచారకేంద్రం ఆధ్వర్యంలో ఐసీఏఆర్-ఏటీఏఆర్ఐ(హైదరాబాద్ జోన్) సౌజన్యంతో అధునాతన టెక్నాలజీ ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు అనేఅంశంపై కేవీకేశాస్త్రవేత్తలకు నిర్వహించిన రెండ్రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్-ఏటీఏఆర్ఐ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా మాట్లాడుతూ..పాడిపరిశ్రమలోని అధునాతన సాంకేతికతని రైతులకు అందించాలని సూచించారు. వర్సిటీ డీఈ ప్రొఫెసర్ బి.శోభామణి, డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.వినూ, సీసీవీఈసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుజాత, వివిధవిభాగాల హెడ్లు, సీసీవీఈసీ అధ్యాపకురాలు డాక్టర్ పి.మంజరి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆస్పత్రుల్లో వైద్యులకు సేవా అవకాశం

● ఇందుకోసం యాప్ రూపొందించాలని అదనపు ఈవో ఆదేశం


అధికారులు,వైద్యుల సమావేశంలో వెంకయ్యచౌదరి

తిరుమల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆస్పత్రుల్లో ఉచిత సేవలు అందించదలచిన వైద్యులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునేందుకు వీలుగా ఓ యాప్‌ను అభివృద్ధి చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. గురువారం ఆయన అన్నమయ్య భవనంలో టీటీడీ ఆధ్వర్యంలోని వివిధ ఆస్పత్రుల డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. గతేడాది బ్రహ్మోత్సవాల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడి సూచనల మేరకు ప్రొఫెషనల్ సేవలను ప్రవేశపెట్టాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలో ముందుగా వైద్యరంగం నుంచి ఈ సేవలకు శ్రీకారం చుట్టాలని సంకల్పించింది. టీటీడీ ఆస్పత్రుల్లో ఉచిత సేవలు చేయదల్చిన వైద్యుల కోసం యాప్‌ను అభివృద్ధి చేయాలని ఐటీ ఇంచార్జ్ జీఎం ఫణికుమార్ నాయుడిని అదనపు ఈవో ఈ సమావేశంలో ఆదేశించారు. సీఎం సూచనల మేరకు నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, బర్డ్ డైరెక్టర్ జగదీష్, ఎస్పీసీహెచ్‌సీ డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, టీటీడీ సీఎంవో నర్మద పాల్గొన్నారు.

15మంది స్మగ్లర్ల అరెస్టు

● ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహిచి 15మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన బృందం అన్నమయ్య జిల్లా సానిపాయ, వీరబల్లి ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. అప్పయ్యగారి పల్లి అటవీ ప్రాంతానికి చేరుకోగా కొంత మంది వ్యక్తులు వారి కంటబడ్డారు. చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి 15 మందిని పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేయగా 15 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడ్డ వారు అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. స్మగ్లర్లను వాహనాలు, దుంగలతో సహా తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14న సీనియర్ సాఫ్ట్‌బాల్ టెన్నిస్ జట్ల ఎంపిక

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న జిల్లా సీనియర్ సాఫ్ట్ బాల్ టెన్నిస్ జట్లు ఎంపికలు పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి సుధీర్ తెలిపారు. ఎంపికైన జట్లు విజయవాడలో 27, 28వ తేదీలలో రాష్ట్రస్థాయి సీనియర్ చాంపియన్‌షిప్, రాష్ట్ర జట్ల ఎంపికల్లో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు 14న ఉదయం 8గంటలకు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్సు కాపీతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 9032270031ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అందరిలోనూ భావోద్వేగం

తిరుపతి(వైద్యం)/రేణిగుంట, ఆంధ్రజ్యోతి: నేపాల్ నుంచి వచ్చిన వారిని కదిలిస్తేచాలు.. అక్కడి ఘటనలను తలచుకుని ఆందోళనకు గురయ్యారు. తమను సురక్షితంగా తీసుకొచ్చేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఆనందం వ్యక్తంచేశారు. సొంత గడ్డకు వచ్చామన్న సంతోషంతో భావోద్వేగానికి గురయ్యారు.

గుండె ఆగినంత పనైంది



ఈ నెల 4న అందరితో కలిసి నేపాల్‌కు విహారయాత్రకు వెళ్లాను. అక్కడ ఒకట్రెండు రోజుల్లోనే ఎదురైన పరిస్థితులను చూసి గుండె ఆగినంత పనైంది. కనీసం తలదాచుకునే పరిస్థితి కూడా కనిపించలేదు. ఎప్పుడు ఎవరు దాడి చేస్తారోనన్న భయానక పరిస్థితుల్లో ఉన్నాం. అలాంటి మమ్మల్ని సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసిందన్న విషయమే తిరిగి ధైర్యం నింపింది. ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకానికి తగినట్టుగానే అందరం సురక్షితంగా రాగలిగాం.

- వెంకటేశ్వర్లు, కడప

దిక్కు తెలియని పరిస్థితి



సరదాగా కుటుంబ సభ్యులతో నేపాల్ వెళా వెళ్లి ఎంజాయ్ చేద్దాం అనుకున్నాం. తీరా అక్కడికి వెళ్లాక అనుకోని పరిస్థితులు ఎదురయ్యాయి. ఏం చేయాలో పాలుపోలేదు. హోటళ్లకే ఉండిపోయాం. ఎలా బయటపడాలో అర్థం కాని పరిస్థితిల్లో రాష్ట్ర ప్రభుత్వం మాకోసం అన్ని ఏర్పాట్లూ చేసింది. కొండంత భరోసా కల్పించింది. మేం ఇళ్లకు చేరేవిషయంలో చొరవ తీసుకున్న మంత్రి లోకేష్ కు రుణపడి ఉంటాం.

-అపర్ణాదేవి కడప

ప్రాణాల మీద ఆశ వదులుకున్నాం



- నేపాల్లో జరుగుతున్న తీవ్రమైన పరిస్థితులను చూసి ప్రాణాల మీద ఆశ వదులుకున్నాము. ఇక స్వదేశానికి చేరుకోవడం సాధ్యపడేది కాదని అయిన వారి మీద, ప్రాణాల మీద ఆశలు వదులుకుంటున్న పరిస్థితుల్లో ప్రభుత్వం ఎంతో శ్రమించి తిరిగి మమ్మల్ని అయిన వారి దగ్గరకు చేర్చడం ఎంతో సంతోషంగా ఉంది. ఇందుకు పూర్తి చొరవ చూపిన మంత్రి నారా లోకేష్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటాము.

- సరస్వతి, కడప

శతాధిక వృద్ధుడి మృతి


చిన్నకుమారుడితో రెండ్రోజుల క్రితం ఫొటో దిగిన రామయ్య, ధనమ్మ

పెళ్లకూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపాటూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు ఆరూరు రామయ్య మొదలియార్ (103) గురువారం మృతి చెందారు. ఈయనకు అయిదుగురు మగ సంతానం కాగా, 10 మంది మనవళ్లు, మనవరాళ్లు, 12 మంది మునిమనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. 1922లో జన్మించిన రామయ్య వ్యవసాయమే జీవనాధారంగా జీవించారు. పెద్ద కుమారుడు గోవర్ధన్ (58) హైదరాబాద్‌లోని యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో 2010లో మృతి చెందారు. రెండో కుమారుడు భాస్కర్ (55) నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మూడో కుమారుడు సుధాకర్ శ్రీకాళహస్తిలో న్యాయవాదిగా ఉన్నారు. నాలుగు, అయిదో కుమారులు యుగంధర్, రమణయ్య ఇంటి వద్దనే ఉంటూ వ్య వసాయం చూసుకుంటారు. చిన్నకుమారుడు యుగంధర్ వద్దనే రామయ్య ఉన్నారు. 103 ఏళ్ల వయసులో కూడా ఆయన సొంతంగా తన పనులు చేసుకుంటూ కుమారులకు చేదో డు వాదోడుగా ఉండేవారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తిరుపతి (నేర విభాగం), సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలం తుమ్మలగుంట రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిత్తూరు టౌన్ సామంతి పురానికి చెందిన కొమరవెల్లి కార్తీక్ (26) మృతిచెందినట్లు రూరల్ సీఐ టి.చిన్ని గోవిందు తెలిపారు. ద్విచక్రవాహనంపై ఈయన ఉప్పరపల్లి క్రాస్ నుంచి తుమ్మలగుంట వైపు వేగంగా వెళుతూ.. అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నట్లు చెప్పారు. స్థానికులు, కుటుంబ సభ్యుల సమాచారంతో అంబులెన్సులో అతడిని తిరుపతి రుయాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. మృతుడి తల్లి కె.సుధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నిర్మలా సీతారామన్‌కు ఘన స్వాగతం


నిర్మలా సీతారామన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 11)ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం తిరుపతికి చేరుకున్నారు. తిరుపతి వినామాశ్రయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వెంకటేశ్వర్ ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. సవరించిన జీఎస్టీ, ఇతర విషయాలపై మంత్రి పయ్యావుల కేశవ్ చర్చించారు.

కల్పవృక్ష వాహనంలో కరిరాజముఖుడు



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో గురువారం రాత్రి వినాయకస్వామి కల్పవృక్ష వాహనంలో దర్శనమిచ్చారు.ఆలయ ఈవో, అర్చక, వేదపండితులు, సిబ్బంది ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూల విరాట్‌కు పంచామృత అభిషేకం నిర్వహించారు. రాత్రి ఉభయ వరస రావడంతో ఆలయ అలంకార మండపంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను కల్పవృక్ష వాహనంపై ఉంచి కాణిపాక పుర వీధుల్లో ఊరేగించారు.ప్రత్యేక ఉత్సవాల్లో శుక్రవారం స్వామికి విమానోత్సవం నిర్వహించనున్నారు.

పీ4 విధానంతో బాక్సింగ్ రింగ్ ఏర్పాటు


బాక్సింగ్ రింగ్ ఏర్పాటుకు స్థలపరిశీలన చేస్తున్న శాప్ చైర్మన్, దాతలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో పీ4 విధానంతో బాక్సింగ్ రింగ్ ఏర్పాటు చేయడానికి తిరుపతి జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ముందుకొచ్చింది. జేసీఐ ప్రతినిధులు శేషసాయి, హర్షవర్ధన్ గురువారం ఉదయం శాప్ చైర్మన్ రవినాయుడిని కలసి సాధ్యాసాధ్యాలపై చర్చించారు. శాప్ చైర్మన్, డీఎస్‌డీవో శశిధర్‌తో కలసి స్థల పరిశీలన చేశారు. దాదాపు రూ.10లక్షలతో 40 అడుగుల పొడవు, వెడల్పుతో రెండు నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. శనివారం భూమిపూజ చేయనున్నారు.

పారిశుధ్య కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలి



డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

తిరుపతి (కలెక్టరేట్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని సీఐటీయూ అనుబంధ ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులును కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని పారిశుధ్య కార్మికులు, పంపు ఆపరేటర్లు, డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లకు ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు కావడం లేదన్నారు. 2012 నుంచి ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా జిల్లాలో కేవలం మూడు పంచాయతీల్లో మాత్రమే ఈపీఎఫ్ అమలవుతోందన్నారు. తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, జిల్లా అధ్యక్షుడు నాగభూషణం పాల్గొన్నారు.

రోల్‌బాల్ క్రీడాకారుల జెర్సీ ఆవిష్కరణ



జెర్సీ ఆవిష్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేరళలోని కొల్లంలో జరగనున్న సౌత్‌జోన్ టోర్నమెంటుకు సంబంధించి గురువారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయంలో శాప్ చైర్మన్ రవినాయుడు జెర్సీని ఆవిష్కరించారు. ఈనెల 13, 14 తేదీల్లో సీనియర్ మెన్ అండ్ ఉమెన్ రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న క్రీడాకారులను ఆయన అభినందించారు. టైటిల్ కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో శశిధర్, కోచ్ ప్రేమ్‌నాథ్ పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి సివిల్ సర్జన్ స్పెషలిస్టు బదిలీ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.ఫణీందర్‌ను విశాఖపట్నం ఈఎస్ఐ ఆస్పత్రికి బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే విశాఖపట్నం ఈఎస్ఐ ఆస్పత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డి.కృష్ణకిశోర్‌ను తిరుపతి ఆస్పత్రికి బదిలీ చేస్తున్నట్లు అదే ఉత్తర్వుల్లో పేర్కొంది.

అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌లో ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలో ఈనెల 10వ తేదీ నిర్వహించిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్‌లో ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సాంకేతిక-సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని అన్వేషించడం అనే థీమ్‌కు సంబంధించి పది వినూత్న ఆలోచనలను ఈ వేదికపై ఎస్వీయూ విద్యార్థులు ప్రదర్శించారు. తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాలకు చెందిన అనేక బృందాలు పోటీపడగా ఎస్వీయూ డేటా సైన్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, హెడ్ ప్రొఫెసర్ అంజనబాబు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గంగాధరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీలో విద్యార్థినులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో కాలేజీ బోటనీ విద్యార్థులకు డాక్టర్ కె. గంగాధరం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా మనిషికీ, పర్యావరణానికి చాలా మేలు జరుగుతుందన్నారు. సహజ ఎరువులతో సహజ ఆహార ఉత్పత్తి చేయవచ్చన్నారు. ప్రకృతి ఆహార ఉత్పత్తులు ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యం బాగుంటుందన్నారు. విద్యార్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ప్రకృతి వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు.

పద్మావతి పార్కులో మెరుగైన సౌకర్యాలు

తిరుపతి, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి) : పద్మావతి పార్కులో వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్ బాగు చేసి, జిమ్ పరికరాలకు మరమ్మతులు చేయించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం పద్మావతి పార్కు, పక్కనే ఉన్న మస్టర్ గదిని కార్పొరేటర్ షాలిని, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. పార్కు పక్కన ఫుట్‌పాత్ పైన ఉన్న షాపులు తొలగించాలని, మస్టర్ గది పక్కన ఉన్న మరుగుదొడ్లలో కొళాయిలు బాగు చేయించాలని, వాకింగ్ ట్రాక్ బాగు చేయించాలని టీడీపీ నాయకులు శ్రీధర్ వర్మతోపాటు వాకర్స్ కమిషనర్‌ను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ పార్కులో ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని, మరుగుదొడ్లలో కొళాయిలు ఏర్పాటు చేసి నీరు వృథా కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఫుట్‌పాత్‌లపై దుకాణాలను తొలగించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ మధు, డీఈలు మహేష్, శిల్ప, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో శక్తివంతమైన సమాజం

● సరస్వతి శిశుమందిర్‌లో పోషకాహార దినోత్సవం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే పోషకాహారం అందించడంతో శక్తివంతమైన సమాజాన్ని రూపొందించగలమని ప్రముఖ పోషకాహార నిపుణులు స్వర్ణలత చెప్పారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో పోషకాహార దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తదితర ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల శరీరంలో పోషకాల సమతుల్యత ఉంటుందన్నారు. ఆరోగ్యవంతమైన యువత ద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పోషకాహారం పంపిణీ చేశారు. డాక్టర్ ఎం.హేమంత్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తి వెంకయ్య, డాక్టర్ కె.బాలకృష్ణారెడ్డి, కె.చంద్రశేఖర్, సరస్వతి శిశుమందిర్ కార్యదర్శి హేమకిరణ్, ప్రబంధకారిణి సభ్యులు రామలక్ష్మి, ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

టీటీడీ ఈవోను కలిసిన డిప్యూటీ మేయర్



అనిల్‌కుమార్ సింఘాల్‌కు చిత్రపటం అందజేస్తున్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. టీటీడీ పరిపాలనా భవనంలో శాలువా కప్పి, గరుడ చిత్రపటం ఇచ్చి సత్కరించారు. టీడీపీ నేతలు ఎస్వీఎం శ్రీధర్, రవితేజ నాయుడు, గంజి సుధాకర్ రెడ్డి, నాగప్రతాప్, దేవా ఆచారి, మణి నాయుడు, హేమంత్ పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం యాదవ్



గురవయ్య యాదవ్‌ను సత్కరిస్తున్న సుబ్రహ్మణ్యంయాదవ్

విజయపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడిగా విజయపురం మండలం జంబాడకు చెందిన సుబ్రహ్మణ్యం యాదవ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గురవయ్య యాదవ్ మార్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

ప్రత్యేకావసరాల పిల్లలను ఆదుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకావసరాల పిల్లలను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. విద్యాశాఖ, సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో టీపీపీఎం స్కూల్లో ఏర్పాటు చేసిన మెడికల్ అసెస్మెంట్ క్యాంపును గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏటా ప్రభుత్వం మెడికల్ అసెస్మెంట్ క్యాంప్‌ను నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా గతేడాది 659 మందికి ఉపకరణాలు అందించామని తెలిపారు. అలవెన్సు రూ.3వేలు నుంచి రూ.5వేలకు పెంచామన్నారు. వినికిడి, దృష్టి లోపాలు ఉన్న వారికి విద్యాపరంగా ఆటంకం కాకుండా ట్యాబ్స్ అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ గౌరీశంకరరావు, డిప్యూటీ ఈవో ఇందిరాదేవి, ఎంఈవో బాలాజీ, చంద్రశేఖర్‌రెడ్డి, మురుగన్ పాల్గొన్నారు.

లౌకిక, ప్రజాస్వామ్యవాది ఏచూరి

సీపీఎం నేత వందవాసి నాగరాజు



సీతారాం ఏచూరికి నివాళి అర్పిస్తున్న నాగరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీతారాం ఏచూరి లౌకిక, ప్రజాస్వామ్యవాది అని సీపీఎం నేత వందవాసి నాగరాజు పేర్కొన్నారు. ఏచూరి తొలి వర్ధంతిని పురస్కరించుకుని ఎస్వీయూలో ఎస్ఎఫ్ఐ నేతలు గురువారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. నాగరాజు మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా గొప్ప పోరాటం చేశారన్నారు. ఇండియా కూటమి ఏర్పాటులో ఆయన కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. జీవించినంత కాలం లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రయత్నించారని తెలిపారు. మరణానంతరం తన శరీరాన్ని వైద్య పరిశోధనల కోసం ఇచ్చారని చెప్పారు. ఏచూరి స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అక్బర్, అశోక్, వినోద్ పాల్గొన్నారు.



భాగ్యవల్లి, చంద్రశేఖర్, గుణ, లక్ష్మణరావు, మధులత, సుబ్రమణ్యం, రుద్రకిషోర్





శ్యామల, వరలక్ష్మి, విమల, మురళి (ఎక్స్ అఫిషియో మెంబర్) - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలుపుతున్న మహేష్ యాదవ్

మహేష్ యాదవ్‌కే గంగమ్మ అనుగ్రహం

ఆలయ పాలకమండలిని నియమించిన ప్రభుత్వం - సభ్యుల్లో ఆరుగురు టీడీపీ, నలుగురు జనసేన, ఒకరు బీజేపీ

తిరుపతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తాతయ్యగుంట గంగమ్మ ఆశీస్సులు టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్‌కు వరించాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి కోసం గట్టి పోటీ నెలకొన్న నేపథ్యంలో మహేష్‌కు అవకాశం దక్కింది. 11 మంది సభ్యులతో గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ నుంచి మహేష్ యాదవ్‌తోపాటు ఎం.గుణ, జి.భాగ్యవల్లి, బి.సుబ్రమణ్యం, శ్యామల, లక్ష్మణరావు ఎంపికకాగా,జనసేన నుంచి రుద్రకిషోర్, మధులత, వరలక్ష్మి, విమల, బీజేపీ నుంచి టి.చంద్రశేఖర్ సభ్యులుగా నియమితులయ్యారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు మురళి ఉంటారు. పాలకమండలిలో చోటుకోసం 42 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో చైర్మన్ పీఠం కోసం టీడీపీ నుంచి ఆరుగురు పోటీపడుతుండగా జనసేన నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు పోటీపడ్డారు. అశావహులందరినీ వడపోసిన కూటమి అధిష్ఠానం మహేష్‌వైపే మొగ్గుచూపింది. నగర ప్రధాన కార్యదర్శిగా పార్టీకి కష్టకాలంలో పనిచేశారన్న గుర్తింపు తెచ్చుకున్నారు. చంద్రబాబు అరెస్ట్ అయిన సందర్భంగా నిరసన చేసిన ఘటనలో మహేష్ జైలుకెళ్లారు. పొత్తుల్లో భాగంగా తిరుపతి ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయించడంతో పార్టీ ఆదేశాల మేరకు వ్యవహరించారు. కొందరు విభేదించినా పార్టీ ఆదేశమే శిరోధార్యంగా భావించారు. గంగమ్మ భక్తుడిగా, పార్టీకి విధేయుడిగా పేరుతెచ్చుకున్న మహేష్ నియామకం పట్ల కూటమి వర్గాల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. కాగా, మహేష్ యాదవ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

ఎమ్మెల్యేలు నాని, మురళీమోహన్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు నాని, మురళీమోహన్

తిరుపతి (కల్చరల్), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న కూటమి ప్రభుత్వ పనితీరు చూసి ఓర్వలేక వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అర్థరహితమైన విమర్శలు చేస్తున్నారని చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, కలికిరి మురళీమోహన్ ధ్వజమెత్తారు. ప్రెస్‌క్లబ్ గురువారం వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం పట్ల అక్కసు వెళ్లగక్కడాన్ని తప్పుబట్టారు. మెడికల్ కాలేజీల టెండర్లలో పాల్గొనొద్దని, తాముస్తే వాటిని రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడటం చూస్తుంటే జగన్ రాష్ట్రాభివృద్ధిని ఓర్చుకోలేకపోతున్నారనే విషయం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. సూపర్ సిక్స్ సభ విజయవంతం కాకుండా జగన్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. దోపిడీలు, దౌర్జన్యాలు, స్కాములతో ఐదేళ్లపాటు పాలన సాగించిన జగన్ ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక తన సోషల్ మీడియా, సొంత పత్రిక ద్వారా తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 'మళ్లీ మేమొస్తే అంతు చూస్తాం' అంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంపై బురద జల్లడానికి జగన్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు నమ్మే పరిస్థితిలోలేరని,ఈవిషయం స్థానిక ఎన్నికల్లో మరోసారి స్పష్టమవుతుందన్నారు.

టీటీడీ ప్రతిష్ఠను పెంచాలి

ఆధునీకరించిన ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో బీఆర్‌నాయుడు



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠను పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు పిలుపునిచ్చారు. ఆధునీకరించిన తిరుపతి ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో గురువారం పాల్గొని ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి కొలువై ఉండడం వల్లే తిరుపతి ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఈ కారణంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. దేశవిదేశాల నుంచి భక్తులు శ్రీవారి దర్శనార్థం వస్తుండటంతో టీటీడీ ఖండాంతర ఖ్యాతి గాంచిందన్నారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన టీటీడీ ప్రతిష్ఠను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తప్పొప్పులను నిర్ధారించుకుని నిర్భయంగా వార్తలు రాయాలని కోరారు. వ్యక్తిగత దూషణలతో బురదజల్లే వార్తల విషయంలో ఆలోచనతో ముందుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ సొంత భవన నిర్మాణానికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేయడంతోపాటు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తూ అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తోందన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్‌కు సొంత భవనం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని త్వరలోనే కేటాయిస్తామని, జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ నూతన భవనంలో తొలి అంతస్తు నిర్మాణ పనులను స్వయంగా చేయిస్తానని హామీ ఇచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ తిరుపతి ప్రెస్‌క్లబ్‌తో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్, కీర్తన, ఆకేపాటి సుభాషిణి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, కార్యదర్శి బాలచంద్ర, సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రీయ మిలిటరీ స్కూళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్‌లో ప్రవేశాలకుగాను ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న పరీక్షకు అక్టోబరు 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 86888 88802 / 93999 76999లలో వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ - నవోదయ పోటీ పరీక్షల కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

మంత్రి సత్యకుమార్‌కు వీడ్కోలు



తిరుపతి (విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు స్థానిక బీజేపీ నాయకులు వీడ్కోలు పలికారు. అనంతపురంలో బుధవారం జరిగిన సూపర్ హిట్ సభలో పాల్గొన్న ఆయన గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. అనంతపురం నుంచి రోడ్డు మార్గంలో రాత్రి తిరుపతికి చేరుకుని, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైల్లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. రైల్వేస్టేషన్‌లో మంత్రిని కలిసిన బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, గుండాల గోపీనాథ్‌రెడ్డి వీడ్కోలు పలికారు.





తిరుచానూరు యోగిమల్లవరంలోని సాలగ్రామ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు గురువారం సందర్శించారు. ఆలయంలోని స్వామి నీడ ధ్వజస్తంభంగా పడుతుండడం తిలకించి మొక్కుకున్నారు

ఘనంగా పార్థసారథి భట్టాచార్యుల జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న వేద పండితులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వేద పరిరక్షణకు రొంపిచెర్ల పార్థసారథి భట్టాచార్యుల విశేష కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. వేద విశ్వవిద్యాలయ వైఖానసాగమ విభాగంలో 'పార్థసారథి భట్టాచార్యుల జయంతి సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మంగళగిరికి చెందిన వైఖానసాగమ పండితులు దీవి శ్రీనివాసాచార్యులు, వర్సిటీ అకడమిక్ డీన్ గోలి సుబ్రమణ్యశర్మ, పార్థసారథి భట్టాచార్యుల తనయుడు శత్రుఘ్నాచార్యులు, తిరుమల వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని, రాఘవ దీక్షితులు, శ్రీనివాస దీక్షితులు, ప్రభాకరాచార్యులు, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఆంధ్ర, కన్నడ, తమిళ ప్రాంతాల్లో పార్థసారథి భట్టాచార్యులు తిరిగి ఎంతో విలువైన వేద విజ్ఞానాన్ని వెలుగులోకి తీసుకొచ్చారని శ్లాఘించారు. తిరుమలలో వైఖానస ఆశ్రమాన్ని నిర్మించారన్నారు. వైఖానస గ్రంథాలను ముద్రించారన్నారు. రెండేళ్ళుగా వైఖానసాగమంలో ప్రతిభ కనబరిచిన హరిచరణ్, సాయిగౌతమ్‌లను రూ.5 వేల చొప్పున నగదు బహుమతితో సత్కరించారు.



శ్రీముఖి - రమేష్‌బాబు, నారాయణరావు - బొలిశెట్టి శ్రీనివాస్

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ బొలిశెట్టి శ్రీనివాస్, విప్ గణబాబు, ఎమ్మెల్యేలు రమేష్, చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి కిల్లి కృపారాణి, తిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఉన్నారు. సినీనటి, యాంకర్ శ్రీముఖి వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.56 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,086

తలనీలాలు సమర్పించినవారు: 28,239





ఎటు చూసినా భక్త జనమే

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వచ్చేవాళ్లు వస్తుంటే.. పోయే వాళ్లు పోతుంటే.. ఎటు చూసినా భక్తజనమే. వెంకటగిరి పోలేరమ్మ జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వీఐపీలు ఎక్కువ కావడంతో సామాన్య భక్తులు ఇబ్బంది పడ్డారు. క్యూలైన్ వద్ద కొందరు భక్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొందరు పోలీసు సిబ్బంది తమవారికి దర్శనం చేయించడానికి ప్రాధాన్యం ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. రూ.100, రూ.300, రూ.500 క్యూ ప్రవేశాలు పెట్టినా, వీవీఐపీ దర్శనంలో ఫ్రీగా వదిలి వేశారు. జాతరను నిర్వహించడంలో అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నీ తానై వ్యవహరించారు.



భక్తుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

జాతర ప్రశాంతం

ఎలాంటి గొడవలు లేకుండా జాతర ప్రశాంతంగా జరిగింది. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దగ్గరుండి బందోబస్తును పర్యవేక్షించారు. క్యూలైన్‌లో భక్తులకు నీటి సరఫరా చేయాల్సిన ఎండోమెంట్, మున్సిపాలిటీ చేతులు ఎత్తివేశారు. దీంతో క్యూలైన్‌లో భక్తుల ఇబ్బందులు గుర్తించిన ఎస్పీ.. నీటిని అందివాల్సిందిగా పోలీసులను ఆదేశించారు. దీంతో గూడూరు డీఎస్పీ గీతాకుమారి సిబ్బందితో కలిసి క్యూలైన్‌లో భక్తులకు నీళ్ల బాటిళ్లను అందించారు. మద్యం మత్తులో కొందరు ఆకతాయిలు పోలీసులు పట్ల దురుసుగా వ్యవహరించినా సుత్తిమెత్తగా మందలించి పంపించేశారు.

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందడంలో ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, దేవదాయశాఖ శాఖ కమిషనరు రామచంద్ర నాయుడు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలేరమ్మకు భక్తులు పొంగళ్లు పెట్టేందుకు మండపం నిర్మిస్తామని తెలిపారు. పోలేరమ్మ జాతరకు రాష్ట్ర గుర్తింపుతో పాటు.. జాతర నిర్వహణకు రూ.40లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తన డబ్బుతో క్రాస్‌రోడ్డు వద్ద అమ్మవారి ఆర్చి నిర్మించారన్నారు. ఆయన కోరిక మేరకు పాలకేంద్రం వద్ద మరో ఆర్చిని ప్రభుత్వ నిధులతో నిర్మించనున్నట్లు చెప్పారు. అమ్మవారి దేవస్థానానికి ఆర్థిక వనరులు సమకూర్చేలా దక్షిణపు వీధిలో 75 అంకణాల స్థలాన్ని దేవస్థానికి చెందేలా రాయించి, అందులో రూ.1.65 కోట్లతో జ్ఞాన మందిరం, కమర్షియల్ కాంప్లెక్సు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనుట్లు తెలిపారు. అనంతరం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, పోలేరమ్మ దేవస్థానం ట్రస్టు చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

రోజా వ్యాజ్యంపై వివరాలు సమర్పించండి

నగరి పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలిభానుప్రకాశ్‌పై కేసు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్‌కె రోజా వేసిన వ్యాజ్యంలో వివరాలు సమర్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణ ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసినప్పటికీ నగరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేయడంలేదని పేర్కొంటూ రోజా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ ఏడాది జూలై 17న తాను ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఐఐటీలో ఐదుగురు ప్రొఫెసర్లకు ఉత్తమ సేవా అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకున్న ప్రొఫెసర్లతో డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఐదుగురు ప్రొఫెసర్లకు టీచర్స్‌డే సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులను ప్రదానం చేశారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఎలక్ట్రికల్ ఇంజనీర్ విభాగం హెడ్ భాస్కర్ రామమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి అవార్డులు ప్రదానం చేశారు. బెస్ట్ రీసెర్చ్ అవార్డును ప్రొఫెసర్ రవిశంకర్, ప్రొఫెసర్ ఎం.షికావుద్దీన్, బెస్ట్ టీచర్స్ అవార్డును రాఘవేంద్ర, ఎం.పంచాత్రం అందుకున్నారు. యంగ్ రీసెర్చ్ అవార్డును అభిషేక్ కుమార్ అమదుకున్నారు.

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా పద్మావతి వర్సిటీ విద్యార్థిని



చంద్రికను అభినందిస్తున్న వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ బీటెక్ సీఎస్ఈ నాల్గవ సంవత్సర విద్యార్థిని కుంచెల చంద్రిక గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. గూగుల్ టెక్నాలజీపై స్వల్పకాలిక అవగాహన, శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం చంద్రికకు కలిగింది. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ మల్లికార్జున, హెడ్ సరిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు 24మంది

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చేనెల నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు 24మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో గురువారం జరిగిన అండర్ 11, 14, 17, 19 విభాగాలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 112మంది ప్రాతినిధ్యం వహించారు. ప్రతి విభాగం నుంచి ముగ్గురు చొప్పున బాలబాలికలు విజయం సాధించారు. జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి, స్కేటింగ్ కోచ్ ప్రేమ్‌నాథ్ అభినందించారు. అంతకుముందు శాప్ చైర్మన్ రవినాయుడు క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రతిభచాటాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు గాంధీ, శోభన్‌బాబు, శ్రీధర్, వినోద్ పాల్గొన్నారు.



స్కేటింగ్ క్రీడాకారులతో శాప్ చైర్మన్ రవినాయుడు

గంగమ్మ గుడి చైర్మన్‌గా మహేష్ యాదవ్



తిరుపతి, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ చైర్మన్‌గా టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ నిమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. సభ్యులుగా టీడీపీ నుంచి ఎం.గుణ, జి.భాగ్యవల్లి, బి.సుబ్రమణ్యం, శ్యామల, లక్ష్మణరావు, జనసేన నుంచి రుద్రకిషోర్, మధులత, వరలక్ష్మి, విమల, బీజేపీ నుంచి టి.చంద్రశేఖర్, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు మురళి నియమితులయ్యారు.

తిరుమలలో కేంద్రమంత్రి నిర్మల సీతారామన్



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు వచ్చారు.తిరుమలలోని గాయత్రి గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆమెకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళికృష్ణ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.. నిర్మల సీతారామన్ రాత్రికి తిరుమలలోనే బస చేసి శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.

నెలలో అగ్నిమాపక పరికరాల వివరాలు తెలపాలి

భవన యజమానులకు అగ్నిమాపక శాఖ సూచన

విజయవాడ (వన్‌టౌన్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భవన యజమానులు నెల రోజుల్లోపు వారి భవనాలలో అగ్నిమాపక పరికరాల వివరాలను తెలియజేయాలని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ సంచాలకుడు రమణ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మధ్యవర్తులను ఎవరినీ సంప్రదించవద్దని, ఏదైనా సమాచారం కావాలంటే 9441236448 నెంబరులో కానీ, కనెక్ట్ డీజీ ఫైర్ జీ మెయిల్‌లో కానీ సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు తీర్పు మేరకు 2021-22 సంవత్సరంలో అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర ధ్రువపత్రాలను సవరిస్తూ జారీ చేసిన ప్రభుత్వ గెజిట్ మేరకు అగ్నిమాపక చట్టం 1999కి అనుగుణంగా హైరైజెడ్ భవనాలలో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయటానికి సమయం ఇచ్చినట్టు వెల్లడించారు. భవన యజమానులు 30 రోజుల్లో ఈ వివరాలను అందించాలని, అదనపు సమయం అవసరమైతే అగ్నిమాపక శాఖకు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. చట్టానికి అనుగుణంగా భవనాల్లో అగ్నిమాపక పరికరాలు ఉన్నట్లయితే రివైజ్డ్ నిరభ్యంతర (ఎన్‌వోసీ) జారీ చేస్తామని తెలిపారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి: మౌర్య

తిరుపతి, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):జాతీయ మహిళా సాధికారిత సదస్సుకు సంబంధించి నిర్దేశిత విధులను అధికారులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదేశించారు. గురువారం ఆమె అధికారులతో సమావేశమయ్యారు. ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. అలసత్వం వహించకుండా సమర్థంగా పనిచేయాలన్నారు. అతిథులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్‌సిటీ జి.ఎం. చంద్రమౌళి, తుడా ఈఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్లు, వివిధ విభాగాల అధికారలు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

● భయాందోళనతో పరుగులు తీసిన స్థానికులు


ట్రాన్స్‌ఫార్మర్‌లో చెలరేగుతున్న మంటలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో గురువారం రాత్రి అకస్మాత్తుగా భారీ శబ్ధంతో పేలి మంటలు చెలరేగాయి. సరిగ్గా 7 గంటల సమయంలో ట్రాన్స్‌పార్మర్‌లో ఉన్నట్లుండి మంటలు చెలరేగి చుట్టుపక్కలకు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. అదే సమయంలో నూతనంగా నియమితులైన రైతుసేవా సహకార సంఘ అధ్యక్షుడు బాలచంద్ర కిషోర్ అభినంద సభకు టీడీపీ నాయకులు ర్యాలీగా వెళ్తున్నారు. మంటలు భారీగా వ్యాపించడంతో అక్కడున్న వారందరూ అరుస్తూ పరుగులు తీశారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు సమాచారం తెలుసుకుని విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. దాదాపు రెండు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

తెగిపడిన విద్యుత్ మెయిన్ లైన్

● నాలుగు ఆవులు మృతి


విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన ఆవులు

కోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోట మండలం వావిళ్లదొరువు వద్ద గురువారం విద్యుత్ మెయిన్‌లైన్ తెగి మేతమేస్తున్న నాలుగు ఆవులపై పడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. గోవిందపల్లికి చెందిన కరీముల్లా, చినవెంకటయ్య, ఆదిమూర్తికి చెందిన ఆవులను కరీముల్లా అనే పశువులకాపరి వావిళ్లదొరువువద్ద పొలాల్లోకి మేత కోసం తోలుకెళ్లారు. ఆవులు మేత మేస్తున్న సమయంలో 33/11 కేవీ కొత్తపట్నం వెళ్లే విద్యుత్ మెయిన్‌లైన్ ఒక్కసారిగా తెగి వాటిపై పడింది. దీంతో ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న ఆవుల యజమానులు లబోదిబోమంటూ గుండెలు బాదుకున్నారు.

వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి


మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధికారప్రతినిధి మనోజ్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మనదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో దిగ్విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1893లో చికాగో మహాసభల్లో సెప్టెంబరు 11వ తేదీన మన దేశ గొప్పతనాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచ దేశాలకు స్వామివివేకానంద చాటిచెప్పిన రోజును దిగ్విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నట్లు చెప్పారు. ఆయన స్ఫూర్తితో యువత దేశాభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, శివశంకర్, చైతన్య, మస్తాన్, నవీన్, కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

తడలో ఓ మోస్తరు వర్షం


ఎంఈఓ కార్యాలయం ముందు నిలిచి ఉన్న వర్షపునీరు

తడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తడలో బుధవారం రాత్రి ఓ మోస్తరుగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన ఈ వర్షం గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. స్థానిక ఎంఈవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఉన్నత పాఠశాల మైదానంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో మండలస్థాయి క్రీడా పోటీలను నిలిపివేశారు.

యువత ఆత్మస్థైర్యాన్ని కోల్పోకూడదు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో యువత ఆత్మస్థైర్యాన్ని కోల్పోకూడదని, ప్రతి సమస్యకు ఒక పరిష్కారం దొరుకుతుందని, దానిని గమనించుకుంటూ ముందుకుసాగాలని నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణకుమారి అన్నారు. గురువారం అంతర్జాతీయ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాల సమావేశ మందిరంలో విద్యార్థులతో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువత ప్రతి చిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ఆత్మహత్యలకు పాల్పడటం మంచి పద్ధతికాదన్నారు. ప్రతి ఒక్కరూ సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. అధ్యాపకులు డాక్టర్ కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోకులకృష్ణలో ప్రాంగణ ఎంపికలు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపక బృందం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు బినీత్, ఆనంద్, హరికృష్ణలు విచ్చేసి విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మొత్తం 150 మంది విద్యార్థులు ప్రాంగణ ఎంపికలకు హాజరుకాగా, వారిలో 27 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్ ఒక ప్రటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య, అధ్యాపక బృందం అభినందించారు.

పాదరక్షలు, దుప్పట్ల వితరణ


అర్చకులకు పాదరక్షలు అందజేసిన పసుపులేటి కిషోర్ తదితరులు

కోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రగతి ఆస్పత్రిలో గురువారం ఆ ఆస్పత్రి అధినేత పసుపులేటి కిషోర్ జన్మదినాన్ని పురస్కరించుకొని అర్చకులు, వారి కుటుంబసభ్యులకు పాదరక్షలు, దుప్పట్లు, కూరగాయలను వితరణగా ఇచ్చారు. జిల్లా అర్చక సలహామండలి సభ్యులు దివి అనంతాచార్యులు, అక్షయసేవాసమితి అధ్యక్షులు అల్లం రమణయ్య చేతుల మీదుగా ఆయా అర్చక కుటుంబాలకు ఈ సామగ్రిని అందజేశారు. అర్చక కుటుంబాలకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని పసుపులేటి కిషోర్, డాక్టర్ దివ్యప్రియ దంపతులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నరేష్‌శర్మ, సాయిబాబా, పవన్, శివకుమార్, రూపేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

పోలేరమ్మ జాతర సందడి


వెంకటగిరిలో భవనాలపై భక్త జనం


అమ్మవారికి సారె తీసుకొస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు - ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుటుంబసభ్యులు


వీఐపీ క్యూలైన్ల వద్ద సామాన్య భక్తుల మధ్య తోపులాటలు, అడ్డుకుంటున్న పోలీసులు


సారె తీసుకొస్తున్న వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞకుమార్ యాచేంద్ర - నగరి నుంచి శరవళ్లు తీసుకొస్తున్న రాజా అనుచరుల


పగిలే టెంకాయ ముక్కల కోసం - ఆటపాటల కోలాహలం

అమ్మవారి సేవలో ప్రముఖులు

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందర్భంగా గురువారం అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞ యాచేంద్ర, రాంప్రసాద్ యాచేంద్ర, వెంకటగిరి సివిల్ జడ్జి విష్ణువర్మ, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీ, డీసీఎంఎస్ చైర్మన్ గంగోడు నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా, నెల్లూరు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, నెల్లూరు జిల్లా ఎస్పీ శ్రీకాంత్ కుటుంబ సభ్యులు, న్యాచురోపతి డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతరలో సాంప్రదాయాలను మరిచారు

పోలేరమ్మ జాతర నిర్వహణలో పాటించాల్సిన సాంప్రదాయాలను అధికారులు, నిర్వాహకులు మరిచిపోయారని ఏపీపీ ప్రకృతికుమార్ అన్నారు. గురువారం స్థానిక పోలేరమ్మ ఆలయం వద్ద మాట్లాడుతూ జాతర నిర్వహణలో లోపాలు జరగనప్పటికీ ఆచార సాంప్రదాయాలు మరిచి అమ్మవారిని అగౌరవపరిచేలా నిర్వహించడం బాధాకరమన్నారు. జాతర నిర్వహణలో మేధావులతో సంప్రదింపులు జరిపి ఉంటే భేషుగ్గా జరిగేదన్నారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్, శ్యాంకుమార్, పోతులూరు, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ


జాతరలో వేషధారుల సందడి

స్థానిక కాశీపేట కూడలిలో పోలేరమ్మ జాతర సందర్భంగా వైసీపీ నాయకులు అర్జుగారి మురళి భక్తులకు, ప్రజలకు గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి ఏటా సుదూర ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి


గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత బస్టాండు సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్‌ఐ తిరుపతయ్య వివరాల మేరకు... స్థానిక పాతబస్టాండు సమీపంలో ఓ వృద్ధుడు అపస్మారకస్థితిలో పడివుండటాన్ని స్థానికులు గుర్తించారన్నారు. వృద్ధుడిని చికిత్సనిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారన్నారు. 60 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన

గూడూరు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ నగర్ సమీపంలో బుధవారం హత్యకు గురైన రహీద్‌బాషా కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని అతడి కుటుంబసభ్యులు గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్య చేసిన వారిపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహీద్‌బాషాపై సోషల్ మీడియాలో అసత్య కథనాలు ప్రచురించారంటూ కుటుంబసభ్యులు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

కోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోట మండలం, విద్యానగర్‌లోని ఎక్స్‌ట్రాటెక్స్ రెస్టారెంట్‌పై గురువారం జిల్లా ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) అధికారి ఎస్.మద్దిలేటి ఆకస్మిక దాడులు నిర్వహించారు. రెస్టారెంట్‌లో బూజుపట్టిన, కాలంచెల్లిన తినుబండారాలను విక్రయిస్తున్నారంటూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు పులి సురేష్‌లు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదుచేసి ఉన్నారు. దీంతో మద్దిలేటి తమ సిబ్బందితో వచ్చి ఆ రెస్టారెంట్‌లో తనిఖీలుచేయడంతో వాస్తవాలు వెల్లడయ్యాయి. ఫిర్యాదులన్నీ వాస్తవాలని తేల్చి, కొన్ని కాలంచెల్లిన తినుబండారాలను సీజ్ చేశారు. ఈ రెస్టారెంట్ యాజమాన్యంపై కేసులు పెట్టి అనుమతులు రద్దుచేస్తామని సేఫ్టీ అధికారి మద్దిలేటి తెలిపారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల నిరాహార దీక్షలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట డిపో ఎదుట చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. డిపోలో పనిచేసే కండక్టర్ పద్మ సస్పెన్షను నిరసిస్తూ చేస్తున్న రిలే దీక్షలు గురువారంతో 14వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో జమాల్, విజయకృష్ణ, పద్మ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

గూడూరు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోగినేనిపురంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఈ నరేంద్రరెడ్డి గురువారం తెలిపారు. గూడూరు పట్టణ, మండలం, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకునేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

నాయుడుపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఆ సంస్థ మేనేజర్ బాలాజీ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వీధుల్లో ఆర్గనైజేషన్ సిబ్బందితో కలసి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

● సామూహిక వివాహాలతో ఒక్కటైన నూతన వధూవరులు ● కిటకిటలాడిన భక్త జనం


వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, హాజరైన భక్తులు

చిట్టమూరు, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): మల్లాంలో జరుగుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. వేద పండితులు నాదెండ్ల రామేశ్వర గురుకుల్, ప్రధానార్చకులు భానుప్రకాష్ శర్మలు కల్యాణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి, సాహితిలతో కలసి ఉభయకర్తలు కల్యాణ వేదిక, పుష్పాలంకరణ, కానుకలను సమర్పించారు. వళ్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలో శత స్తంభాల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కుమారుడి కల్యాణ్యానికి పట్టువస్త్రాలు, చందన, విభూది, గంధంతో కూడిన సుగంధ ద్రవ్య పరిమళాలను శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి చైర్మన్, ఆలయ సభ్యులు, పండితులు వచ్చి చైర్మన్ దంపతులకు అందజేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాలు వేసి ఆశీర్వాదం పొందారు. ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. చిట్టమూరు ఎస్‌ఐ చిన్న బలరామయ్య సిబ్బందితో కలిసి భక్తులకు భద్రత కల్పించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు స్వామి వారి ఉత్తరీయం, చిత్రపటాలను బహూకరించారు. అనంతరం ప్రసాద వినియోగం, బ్రాహ్మణ సమారాధన కార్యకలాపాలను ఉభయకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు.

సామూహిక వివాహాలు

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ సమయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ సుమారు 76 జంటలకు పైగా నూతన వధూవరులు వివాహాలు చేసుకున్నారు. అనంతరం స్వామి దర్శనం చేసుకొని నూతన దంపతులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వేలాది మంది భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు.

టీడీపీలో కష్టపడ్డవారికి సముచిత స్థానం

● ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ


ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రమాణస్వీకార పత్రాన్ని అందుకుంటున్న బాలచంద్ర కిషోర్, మురళిరెడ్డి, పక్కనే టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడ్డవారికి సముచిత స్థానం ఉంటుందని, పదవులు రాలేదని ఎవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం స్థానిక రైతు సహకార సేవాసంఘ కార్యాలయంలో సూళ్లూరుపేట రైతుసేవా సహకార సంఘ అధ్యక్షుడిగా బాలచంద్ర కిషోర్, డైరెక్టర్‌గా నియమితులైన దువ్వూరు మురళిరెడ్డిల అభినందనసభ ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో పనిచేసే నాయకుల నుంచి కార్యకర్త వరకు అందరికీ గుర్తింపు ఉంటుందన్నారు. పదువులు ఉన్నా లేకున్నా పార్టీకోసం అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న బాలచంద్ర కిషోర్, మురళిరెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదే హవా కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బాలచంద్రకిషోర్, మురళిరెడ్డిలను ఘనంగా సన్మానించి, అభినందించారు. ముందుగా మన గ్రోమోర్ సెంటర్ నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా రైతు సేవా సహకార సంఘ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, మాధవ నాయుడు, నాగేశ్వరస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, అలవల శ్రీనివాసులు, శ్రీనివాసుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌లో ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలో ఈనెల 10వ తేదీ నిర్వహించిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్‌లో ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సాంకేతిక-సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని అన్వేషించడం అనే థీమ్‌కు సంబంధించి పది వినూత్న ఆలోచనలను ఈ వేదికపై ఎస్వీయూ విద్యార్థులు ప్రదర్శించారు. తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాలకు చెందిన అనేక బృందాలు పోటీపడగా ఎస్వీయూ డేటా సైన్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, హెడ్ ప్రొఫెసర్ అంజనబాబు పాల్గొన్నారు.

రోల్‌బాల్ క్రీడాకారుల జెర్సీ ఆవిష్కరణ

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):కేరళలోని కొల్లంలో జరగనున్న సౌత్‌జోన్ టోర్నమెంటుకు సంబంధించి గురువారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయంలో శాప్ చైర్మన్ రవినాయుడు జెర్సీని ఆవిష్కరించారు. ఈనెల 13, 14 తేదీల్లో సీనియర్ మెన్ అండ్ ఉమెన్ రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులను ఆయన అభినందించారు. టైటిల్ కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. డీఎస్‌డీవో శశిధర్, కోచ్ ప్రేమ్‌నాథ్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

● 103 ఏళ్లు ఆరోగ్యంగా జీవించిన రామయ్య మొదలియార్
● 10 మంది మనవళ్లు, మనవరాళ్లు, 12 మంది మునిమనవళ్లు


చిన్నకుమారుడు యుగంధర్‌తో రెండ్రోజుల క్రితం ఫొటో దిగిన రామయ్య మొదలియార్, ఆయన సతీమణి ధనమ్మ

పెళ్లకూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపాటూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు ఆరూరు రామయ్య మొదలియార్ (103) గురువారం మృతి చెందారు. ఈయనకు అయిదుగురు మగ సంతానం కాగా, 10 మంది మనవళ్లు, మనవరాళ్లు, 12 మంది ముని మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. 1922లో జన్మించిన రామయ్య వ్యవసాయమే జీవనాధారంగా జీవించారు. పెద్ద కుమారుడు గోవర్ధన్ (58) హైదరాబాద్‌లోని యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో 2010లో మృతి చెందారు. రెండో కుమారుడు భాస్కర్ (55) నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మూడో కుమారుడు సుధాకర్ శ్రీకాళహస్తిలో న్యాయవాదిగా ఉన్నారు. నాలుగు, అయిదో కుమారులు యుగంధర్, రమణయ్య ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయం చూసుకుంటారు. చిన్నకుమారుడు యుగంధర్ వద్దనే రామయ్య ఉన్నారు. 103 ఏళ్ల వయసులో కూడా ఆయన సొంతంగా తన పనులు చేసుకుంటూ కుమారులకు చేదోడు వాదోడుగా ఉండేవారు. రామయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సర్పంచ్ శివకుమార్,పరంధామయ్య, ప్రకాశం, రామయ్య తదితరులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

14న జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ టెన్నిస్ జట్ల ఎంపిక

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న జిల్లా సీనియర్ సాఫ్ట్ బాల్ టెన్నిస్ జట్లు ఎంపికలు పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి సుధీర్ తెలిపారు. ఎంపికైన జట్లు విజయవాడలో 27, 28వ తేదీలలో రాష్ట్రస్థాయి సీనియర్ చాంపియన్‌షిప్, రాష్ట్ర జట్ల ఎంపికల్లో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు 14న ఉదయం 8గంటలకు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్సు కాపీతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 9032270031ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో రాయలసీమ విద్యార్థి ప్రతిభ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రాయల సీమ జూనియర్ కళాశాల విద్యార్థి వెంకట్ అంతర్‌జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి విజేతగా నిలిచాడు. కావలి చేవూరులోని శ్రీరామ దూత స్వామి అనాథపిల్లల ఆశ్రమంలో గత నెల 29 నుంచి 31వ తేదీ వరకు పోటీలు జరిగాయి. ఈ పోటీలలో వెంకట్ సత్తా చాటి కప్పు కైవసం చేసుకున్నాడు. బుధవారం నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కాగా గురువారం కళాశాలలో కరస్పాండెంట్ సుబ్బరామిరెడ్డి, ప్రిన్సిపాల్ జయభారత్‌రెడ్డి వెంకట్‌ను అభినందించారు.

కొత్త శానిటరీ విధానంతో ముక్కంటి ఆదాయానికి నష్టం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎండోమెంట్ పరిధిలో అమలు చేయనున్న శానిటరీ కాంట్రాక్టు విధానంతో శ్రీకాళహస్తీశ్వరాలయానికి భారీగా నష్టం వాటిల్లనుందని ముక్కంటి ఆలయ మాజీ చైర్మన్, వైసీపీ నేత అంజూరు శ్రీనివాసులు ఆరోపించారు. సెంట్రలైజడ్ కాంట్రాక్టు విధానం రద్దుచేయాలని కోరారు.

శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు చైర్మన్‌గా ఖాదర్‌బాషా



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు చైర్మన్‌గా ఎస్.ఖాదర్‌బాషా నియమితుల య్యారు. ఈమేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా ఖాదర్ బాషా, సభ్యులుగా మురళి, దొరబాబు, బాబు, ఆర్ముగం, రాంబాబు, అనిల్‌కుమార్, గోవర్ధన్, కవితలు నియమితుల య్యారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

చెన్నై సర్వీసులను పునరుద్ధరించాలి: సీపీఎం

సత్యవేడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నుంచి చెన్నై వెళ్లే బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్ కోరారు. సత్యవేడు నుంచి నిత్యం చెన్నై వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. తక్షణమే సత్యవేడు ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు చెన్నై సర్వీసులను యథావిధిగా నడపాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

సత్యవేడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 28 పంచాయతీలకు 2024 -2025 ఆర్థిక సంవ్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో త్రివిక్రమరావు తెలిపారు. మండలంలో అత్యధికంగా సత్యవేడు మేజర్ పంచాయతీకి రూ.14,23,607లు నిధులు విడుదల కాగా అత్యల్పంగా మల్లవారిపాళెం వెస్ట్ పంచాయతీకి రూ. 65,548లు విడుదలయ్యాయి.

సత్యవేడు పీఏసీఎస్ చైర్మన్‌గా మోహన్



మోహన్, చక్రపాణిరెడ్డి, సుబ్రమణ్యంరాజు

సత్యవేడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా మండలం లోని వీఆర్ కండ్రిగ పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత పీ.మోహన్ నియమితులయ్యారు. డైరెక్టర్లుగా రేపల్లెవాడకు చెందిన పీ.చక్ర పాణిరెడ్డి రాజగోపాలపురానికి చెందిన బీజేపీ నేత ఆర్.సుబ్రమణ్యంరాజు నియమితులయ్యారు. ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

ఇంటికే కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ

పిచ్చాటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి ఇంటికే ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ టి.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఫ్యామిలీ సర్వే ఆధారంగా ఈ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారని వివరించారు. అన్నదాత సుఖీభవ మొదటి విడతకు సంబంధించి మరణించిన రైతుల భూముల వారసుల పేర్లకు బదిలీ చేసుకోవాలని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఏర్పేడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పాపానాయుడుపేటలో రాస్ సేవాసమితి ఆధ్వర్యంలో అరవింద్ కంటి ఆస్పత్రి, డీఎస్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 250మంది ప్రజలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు చేశారు. వైభవంగా అభిషేకం నిర్వహించారు. పలు హారతులు సమర్పిం చారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



జడ్జి శ్రీనివాసనాయక్

శ్రీకాళ హస్తి, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని న్యాయస్థాన ఆవరణంలో శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంట వరకు జరిగే లోక్ అదాలత్‌లో సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమని ప్రగతి సంస్థ కో-ఆర్డినేటర్ రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని చెన్నైరోడ్డులో గల షిరిడీసాయిబాబా ఆలయం వద్ద అర్చకులు, నిర్వాహకులతో కలిసి బాల్య వివాహాలను నిర్మూలిద్దామని ప్రతిజ్ఞచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు, చర్చిలు, మసీదులలో జరిగే అవకాశం ఉందన్నారు. అలాంటి వేదికల వద్ద బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శశిధర్‌స్వామి, కార్యదర్శి నాగరాజునాయుడు, పాల్గొన్నారు.

కేవీబీపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ లింగ సమానత్వం పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, కల్పలత, సుమతి కోరారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పది రోజులు సంకల్ప పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్త్రీ, పురుషులు సమానమేని తెలిపారు. లీగల్ ఒకేషనల్ ట్రైనింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో తరుణాక్షరెడ్డి, హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు విజయ, సరోజ, సీఆర్పీలు సూపర్, మమత, అంగన్వాడీ టీచర్లు మునీశ్వరి, అరుణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాళెం గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న బాలికలకు గురువారం బేటీ బచావో, బేటీపడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యమున మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు.

వైసీపీ సంయుక్త కార్యదర్శులుగా భాస్కర్‌నాయుడు, హరిశ్చంద్రారెడ్డి

పిచ్చాటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా పిచ్చాటూరు మండలానికి చెందిన సీనియర్ నేతలు కె.వి.భాస్కర్‌నాయుడు, కె.టి.హరిశ్చంద్రా రెడ్డిలను నియమితులయ్యారు. వారిని పలువురు అభినందించారు.

రక్తికట్టించిన ద్రౌపదీ వస్త్రాపహరణ నాటకం

పిచ్చాటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు ధర్మరాజు తిరుణాళ్లలో భాగంగా గురువారం ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టం జరిగింది. ద్రౌపది, దుశ్శాసన వేషధారులు తమ నటనతో మెప్పించారు.

జగన్‌కు మతి భ్రమించింది: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్‌సిక్స్ సభ సక్సెస్ కావడంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మతి భ్రమించిందని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల పేరుతో పలు సంస్థల నుంచి పొందిన రుణాలను తన అవసరాల కోసం వాడుకుని కళాశాలల నిర్మాణాలను పూర్తిచేయని వ్యక్తి జగన్ అని విమర్శించారు. చంద్రబాబు చొరవతో రైతులకు సకాలంలో యూరియా అందుతుంటే జగన్ ఓర్వలేక వి మర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, అచ్చెన్నాయుడు చనిపోవాలని కోరుకోవడం ఆయన రాక్షస మనస్తత్వాన్ని తెలియజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు బీమాల భాస్కర్‌ముదిరాజ్, వజ్రం కిషోర్, డీవీ నారాయణ, కోట చంద్రశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ విజయవంతం

ఎరువుల కొరత వైసీపీ సృష్టి

● మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు విజయవంతం అయ్యారని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అన్నారు. గురువారం ఆయన తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు చేరువ అయ్యేందుకు ఈ సూపర్‌సిక్స్ పథకాలు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమం విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. మరోసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సీఎం ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఇక రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీనిపై వైసీపీ నాయకులు అసత్యప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇలా అభూత కల్పనలతో పోరుబాట కార్యక్రమాలు నిర్వహిస్తే మరోసారి ప్రజల చేతిలో భంగపాటు తప్పతదని హెచ్చరించారు. వైసీపీ నేతల మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని స్పష్టంచేశారు.

శ్మశాన దారి కోసం ఆందోళన



ఎక్స్‌కవేటర్‌తో దారి కల్పిస్తున్న అధికారులు

రేణిగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణయ్యకాల్వ శ్మశాన వాటికకు దారి చూపాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన గురువారం జీపాల్యం పంచాయతీలోని కృష్ణయ్య కాల్వ గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చెంగారెడ్డి మృతిచెందాడు. శ్మశానానికి వెళ్లేదారిని ఆక్రమించి కొందరు ఫెన్సింగ్ వేయడంతో అంత్యక్రియలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో వారు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్యంరెడ్డి గ్రామస్తులతో చర్చించారు. విషయాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహసీల్దార్ తన సిబ్బందితో వెళ్లి ఫెన్సింగ్ తొలగించి దారి కల్పించారు. గ్రామస్తులు టీడీపీ నాయకులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పీహెచ్‌సీలో సిబ్బంది కొరతను తీర్చండి

నాగలాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో సిబ్బంది కొరతను తీర్చాలని నాగలాపురం ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి విజయకుమార్ కోరారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సింధూ ఆధ్వర్యంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల మండల అధికారులు మూడు నెలల్లో జరిగిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. తహసీల్దార్ హనుమాన్ నాయక్ మాట్లాడుతూ రేషన్‌కార్డు లేని వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏవో సుబ్బారావు మాట్లాడుతూ రైతులకు త్వరలో యూరియా అందిస్తామన్నారు.ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కుమారి, జాయిన్ దానివేలు, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే యూరియా అమ్మాలి



ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న ఏవో, అధికారులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే రైతులకు యూరియా అమ్మాలని విజిలెన్స్ ఏవో ఎన్.రామాంజనేయరెడ్డి సూచించారు. గురు వారం చెంచురాజు కండ్రిగ, ఎస్ఎస్‌బీ పేట పిచ్చాటూరులోని ఎరువుల దుకాణాల్లో విజి లెన్స్ సీఐ చంద్రశేఖర్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను ఎవరైనా బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, రైతులకు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు అమ్మినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో మండల వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద ఎమ్మెల్యేలు బొల్లిశెట్టి శ్రీనివాస్, ధర్మరాజు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి సరయు రాయ్, టీటీడీ బోర్డు మెంబరు నరేష్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా సంకట చతుర్థశి పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజంజి వినాయకస్వామి ఆలయం వద్ద సంకట చతుర్థశిని పురస్కరిం చుకుని గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ స్థాపన పూజలు చేసిన అనంతరం అభిషేకం నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

నిర్మల సీతారామన్‌కు ఘన స్వాగతం



రేణిగుంట సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం తిరుపతికి చేరుకున్నారు. తిరుపతి విమానాశ్రయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వెంకటేశ్వర్ ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. సవరించిన జీఎస్టీ, ఇతర విషయాలపై మంత్రి పయ్యావుల కేశవ్ చర్చించారు.

క్రీడా పరికరాల వితరణ



ఏర్పేడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చిందేపల్లి పార్వతి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి ఏర్పేడులోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.15వేలు విలువ చేసే క్రీడా పరికరాలను గురువారం అందజేశారు. హెచ్ఎం మునిలక్ష్మి, ఉపాధ్యాయులు భానుప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయుడు మణి తదితరులు పాల్గొన్నారు.

కడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా నందకిశోర్



వరదయ్యపాళెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరదయ్య పాళెం మండలం కడూరు వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా మండలంలోని అంబూరు పంచాయతీకి చెందిన టీడీపీ నేత ఆణిముత్యం నందకిశోర్ నియమితుల య్యారు. డైరెక్టర్లుగా నెలటూరుకు చెందిన రమేష్, సీఎల్ఎన్‌పల్లెకు చెందిన సి.రవి నియమితుల య్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం నియామక ఉత్తర్వులు జారీచేసింది.

ఘనంగా ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైసీపీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి 200మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి బీరేంద్రవర్మ, రాష్ట్ర గ్రీవెన్స్ కార్యదర్శి సాయి నాయుడు, రాష్ట్ర ఎస్సీ కార్యదర్శి గురునాథం, నాయకులు గోపాల్‌రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ధ్రువపత్రాలు తీసుకున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి 4వ ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల క్రీడా పోటీల్లో కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ధర్మేంద్రసింగ్ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు క్రీడలు జరిగాయి. ఈ పోటీల్లో రన్నింగ్, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, కోకో, టైక్వాండో, ఫుట్‌బాల్, హాకీ, యోగా, షూటింగ్ అండర్-19, 14 విభాగాల్లో 11 బంగారు పతకాలు, మూడు రజత పతకాలు, మూడు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను గురువారం ప్రిన్సిపాల్ అభినందించారు.

అప్పలాయగుంటలో 16 నుంచి పవిత్రోత్సవాలు

వడమాలపేట,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అప్పలాగయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి19 వరకు నాలుగు రోజుల పాటు పవిత్రోత్స వాలు నిర్వహించనున్నట్లు డెప్యూటీ ఈఓ శ్రీవాణి వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ మృతి

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో హైవే అథారిటీకి చెందిన ఓ వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని మరో టిప్పర్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన గురువారం ఉదయం 10 చెన్నై - తిరుపతి జాతీయ రహదారిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఏపీ 03 డబ్ల్యూ 5459 నీటి ట్యాంకర్‌ను డ్రైవర్ రోడ్డుపై నిలిపి మొక్కలకు నీటిని పడుతున్నాడు. ఆ సమయంలో వడమాలపేట వైపున వస్తున్న ఓ టిప్పర్ కారును తప్పించబోయి నీటి ట్యాంక్‌ను వెనుకవైపు నుంచి ఢీకొంది. దీంతో టిప్పర్ ముందుభాగం నుజ్జునుజ్జయింది. టిప్పర్ డ్రైవర్ అయిన ఢిల్లీ క్యాబిన్‌లో చిక్కుకుని మృతిచెందాడు. మృతుడిది తిరవళ్లూరు జిల్లా పొన్నేరి తాలూకా కాటూరు గ్రామం. మృతుడి తండ్రి బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా నీటి ట్యాంకర్ డ్రైవర్ 50 మీటర్ల దూరంలో కాపర్ రెడ్ జెండా పట్టుకుని వెనుక వచ్చే వాహనాలను అప్రమత్తం చేయాల్సి ఉండగా చేయలేదు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వడమాలపేట,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య వంతులుగా ఉంటారని అంగన్వాడీ సూపర్‌వైజర్ గీతాంజలి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కిశోర బాలబాలికల సంకల్ప కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. అనంతరం వడమాలపేటలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. విద్యార్థులతో యువ గ్రూప్, విద్యార్థినులతో సఖి గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఢిల్లీ బాబు. గ్రూప్స్ కో- ఆర్డినేటర్ రమేష్, మహిళా సంరక్షణ కార్యదర్శి మౌనిక అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

తెలుగు యువత నాయకుడికి ఎమ్మెల్యే భాను నివాళి



వడమాలపేట,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనమలపాళ్యం గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకులు చక్రపాణి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

నాగుల పుట్టకు షెడ్డు ఏర్పాటు

పుత్తూరు: స్థానిక రైల్వేక్వార్టర్స్‌లో కొలువైన నాగాలమ్మ ఆలయంలోని నాగుల పుట్టకు రూ.15వేలు విలువ చేసే రేకుల షెడ్డును చక్రాల రుక్మిణి ఏర్పాటు చేయించారు.

మహిళల అభ్యున్నతికి మిషన్ శక్తి

పుత్తూరు అర్బన్: కాపు వీధి అంగన్వాడీ కేంద్రంలో మిషన్ శక్తి కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య, అంగన్వాడీ కార్యకర్త లలిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అటవీ అమరవీరుల దినోత్సవం



మొక్కలను నాటుతున్న రేంజర్ మాధవి, ఏపీవో మమతారాణి

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలం గోపాల కృష్ణాపురం పంచాయతీలో జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక హైస్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ రేంజర్ మాధవి, ఉపాధి హామీ పథకం ఏపీవో మమతారాణి, ఉపాధి సిబ్బంది, స్కూల్ ప్రధానోపాధ్యాయులు వాసు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానందుడు

పుత్తూరు, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): భారత దేశ సంస్కృతి, నాగరికతలను ప్రపంచానికి విశ్వగురువు స్వామి వివేకానంద పరిచయం చేశారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. చికాగోలో 1893లో ఇదేరోజున చారిత్రిక ప్రసంగం చేశారని గుర్తు చేసుకుంటూ గురువారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మన్యం నరసింహులు, దేవకి, వాసవి, సూర్యబాబు, తిరుమలయ్య పాల్గొన్నారు.

శ్మశానంలో ముళ్లపొదల తొలగింపు



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): తడుకు గ్రామానికి చెందిన శ్మశానం ముళ్లపొదలతో నిండిపోయింది. గురువారం తడుకులో ఈశ్వరమ్మ అనే మహిళా మృతి చెందడంతో ఖననం చేయడానికి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సర్పంచ్ బొబ్బిలి యాదవ్ స్పందించి సొంత నిధులు వెచ్చించి ఎక్స్‌కవేటర్ సాయంతో ముళ్లపొదలను తొలగించారు. దారి ఏర్పాటు చేశారు.